ప్రజాశక్తి
శనివారం 13 ఏప్రిల్ 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు



ప్రజాగళం సభకు హాజరైన జనం

'వన్ టౌన్' వద్ద ఉద్రిక్తత

- రిమ్స్ ఘటనలో వైసిపి కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విషయం తెలుసుకొని పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్న బాలినేని
- తెలుగుదేశం పార్టీ వాళ్లను ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. బుధవారం రాత్రి సమతానగర్‌లో గొడవ, దాని తరువాత వైసిపి కార్యకర్తలు రిమ్స్ సర్వజన వైద్యశాల వద్దకు వెళ్లి హాస్పిటల్‌లో అద్దాలు ధ్వంసం చేశారు. ఆసుపత్రి యాజమాన్యం ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు శుక్రవారం ఉదయం పలువురు వైసిపి కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 12 మందిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు నోటీసులు లేకుండా వేకువజామున వైసిపి కార్యకర్తల ఇళ్లకు పోయి భయభ్రాంతులకు గురిచేస్తారా.? అంటూ వన్ టౌన్ సిఐ లక్ష్మణ్, తాలుకా సిఐ భక్తవత్సలరెడ్డిని నిలదీశారు. ముందు తెలుగు దేశం పార్టీ వాళ్ల మీద కేసులు నమోదయ్యాయని, వారిని ఎందుకు పోలీసుస్టేషన్‌కు తీసుకురాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిమ్స్ గొడవ విషయంలో తన పేరు కూడా ఉన్నట్లు చెబుతున్నారని, తనను కూడా అరెస్టు చేయాలని కోరారు. 41ఎ నోటీసులు ఇచ్చి వదిలేస్తామని, విచారణ కోసం పిలిచామని పోలీసులు చెప్పడంతో బాలినేని శ్రీనివాసరెడ్డి పోలీసుస్టేషన్ వద్ద నుంచి బయటకు వచ్చారు. బాలినేని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ▶ 2లో

టిడిపి పాలనను, వైసిపి పాలనను

పోల్చి చూసుకోండి..

- రైతుల ధాన్యం కొనే దిక్కు లేదు..
- పొత్తులు రాష్ట్ర భవిష్యత్ కోసమే
- దండుపాళ్యం బ్యాచ్‌లను తరిమికొట్టండి
- తెలుగుదేశం అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-కొల్లూరు, భట్టిప్రోలు, బాపట్ల జిల్లా

గత తెలుగుదేశం పాలనను, ఈ వైసిపి పాలనను పోల్చి చూసుకోవాలని తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ తెలుగుదేశం అని, జగన్‌కు తెలిసింది అప్పులు చేయడమేనని పేర్కొన్నారు. తాను



రేపల్లెలో మాట్లాడుతున్న చంద్రబాబు

ఆదర్శ డ్రైవర్‌గా మారి ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతానన్నారు. ప్రజాగళంలో భాగంగా శుక్రవారం వేమూరు నియోజకవర్గం కొల్లూరులో ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు నేతృత్వంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. తుఫాను, వరదలు వస్తే ప్రభుత్వం నుంచి సాయం లేదన్నారు. కాలువల్లో పూడికలు తీయక రైతుల పంటలు నీట మునిగి నష్టాల పాలయ్యారని, రైతుల నుంచి ధాన్యం కొనే దిక్కు లేదని ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. ఏప్రిల్ నుంచే రూ.4 వేలు పింఛన్ అమలు చేస్తానన్నారు. పేదరికం ▶ 2లో

ఇంటర్‌లో బాలికలదే హవా..

- ఫస్టియర్‌లో 59 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్‌లో 72 శాతం..
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో బాలికలు మరోసారి వారి హవాను కొనసాగించారు. బాలికలు ఇంటర్ మొదటి సంవత్సరంలో 64 శాతం, ద్వితీయ సంవత్సరం పరీక్షలలో 76 శాతం అత్యధిక ఉత్తీర్ణతా శాతాన్ని అందుకున్నారు. ఇంటర్ ఫస్టియర్‌లో 58.7 శాతం ఉత్తీర్ణతతో 26 జిల్లాల్లో ప్రకాశం జిల్లా 18వ స్థానంలో నిలిచింది. ఇంటర్ సెకండియర్‌లో 71.7 శాతం ఉత్తీర్ణతతో 26 జిల్లాల్లో ప్రకాశం జిల్లా 15వ స్థానంలో నిలిచింది. మే 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి.



ఒంగోలు, శ్రీ సరస్వతి కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న యాజమాన్యం

ఫస్టియర్‌లో 59 శాతం..

ఇంటర్ మొదటి సంవత్సరంలో 59 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. మొదటి సంవత్సరం పరీక్షలకు 18,349 మంది హాజరు కాగా 10,868 మంది ఉత్తీర్ణులై 59 శాతం ఉత్తీర్ణతను అందుకున్నారు. వీరిలో బాలురు 8789 మంది హాజరు కాగా 4722 మంది ఉత్తీర్ణులై 54 శాతం ఉత్తీర్ణతను సాధించారు. బాలికలు 9560 మంది హాజరు కాగా 6145 మంది ఉత్తీర్ణులై 64 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఒకేషనల్ కోర్సులలో 1919 మంది పరీక్షలకు హాజరు కాగా 1032 మంది ఉత్తీర్ణులై 53 శాతం ఉత్తీర్ణతను సాధించారు. వీరిలో బాలురు 924 మంది హాజరు కాగా 414 మంది పాసై 45 శాతం, బాలికలు 1005 మంది హాజరు కాగా 618 మంది పాసై 61 శాతం ఉత్తీర్ణను అందుకున్నారు.

ఫస్టియర్: 6 ఏళ్లలో ఉత్తీర్ణతా శాతం ఇలా...

సంవత్సరం	హాజరైన వారు	పాసైనవారు	ఉత్తీర్ణతా శాతం	స్థానం
2019	26,333	14,336	54	10
2020	27,586	14,885	54	9
2021	31,760	31,760	100	–
2022	27,958	14,272	51.1	6
2023	28091	13507	48.8	10
2024	20278	11900	58.7	18

సెకండియర్: 6 ఏళ్లలో ఉత్తీర్ణతా శాతం

సంవత్సరం	హాజరైన వారు	పాసైనవారు	ఉత్తీర్ణతాశాతం	స్థానం
2019	23,481	15,883	68	9
2020	23,590	13,956	59	7
2021	29,897	29,897	100	–
2022	22,567	16,136	58.5	6
2023	25,461	16,259	63.86	7
2024	17,239	12,366	71.7	15

సెకండియర్‌లో 72 శాతం..

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 71.7 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 15,238 మంది హాజరు కాగా 10,993 మంది ఉత్తీర్ణులై 72 శాతం ఉత్తీర్ణతను అందుకున్నారు. వీరిలో బాలురు 7102 మంది హాజరు కాగా 4800 మంది ఉత్తీర్ణులై 68 శాతం ఉత్తీర్ణతను సాధించారు. బాలికలు 8136 మంది హాజరు కాగా ▶ 2లో

ఇసుక అడిగితే..

శవాన్ని కూడా తెచ్చారు..

3లో ▶

సమస్యల పరిష్కారం కోసం

అధికార, ప్రతిపక్షాలను నిలదీయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-అద్దంకి

ప్రజలను మభ్యపెట్టడానికే ఓట్ల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు వస్తున్నాయని, సమస్యల పరిష్కారం కోసం ఆ పార్టీ నేతలను ప్రజలు నిలదీయాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఉఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రమాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడారు. జిల్లాలో అభివద్ధికి సంబంధించిన అనేక సమస్యలు ఉన్నాయని, ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ బాపట్ల జిల్లా అభివద్ధిని, అందునా ప్రత్యేకించి అద్దంకి నియోజకవర్గాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. భవనాసి రిజర్వాయర్, కోరిశపాడు ఎత్తిపోతల పథకాలు జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించినా ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. అద్దంకి పట్టణంలో ఉన్న టిడ్కో ఇళ్లు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 80 శాతం పూర్తయినప్పటికీ ఇంతవరకు పంపిణీ చేయనటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు కొట్టుకుపోతే ఇంతవరకు సక్రమంగా వాటిని మరమ్మతులు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మోంద్రు ఆంజనేయులు, తంగిరాల వెంకటేశ్వర్లు, రాయిని వినోద్ పాల్గొన్నారు.

టిడిపి పాలనను, వైసిపి పాలనను పోల్చి చూసుకోండి..

(మొదటిపేజీ తరువాయి)

లేని రాష్ట్రం గా ఏపీని నిలుపుతామని చెప్పారు. సభలో బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, టీడీపీలో చేరిన గుంటూరు జడ్పీ చైర్మన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ప్రసంగించారు.

రేపల్లె: రాష్ట్రంలో ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజల ఆగ్రహానికి గురయ్యారని టీడీపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రేపల్లె ఎన్టీఆర్ సర్కిల్లో ఏర్పాటుచేసిన ప్రజాగళం సభలో జగన్‌పై చంద్రబాబు నిప్పులు చేరిగారు. బాపట్ల ఉమ్మడి పార్లమెంటు అభ్యర్థి కష్ణప్రసాద్ నీతి నిజాయితీగా బతికి పది మందికి ఉపయోగపడ్డాడని, అందుకే వెతికివెతికి ఒక సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కష్ణప్రసాద్‌ను నిలబెట్టామని అన్నారు. బాపట్ల ఎంపీగా కష్ణ ప్రసాద్‌ను, రేపల్లె ఎమ్మెల్యేగా అనగాని సత్యప్రసాద్‌ను గెలిపించాల్సిన బాధ్యత రేపల్లె ప్రజలపై ఉందని స్పష్టం చేశారు. కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసమే బిజెపితో పొత్తు పెట్టుకున్నామని మరోసారి స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వైసిపి పాలన వల్ల రాష్ట్రం 30 ఏళు వెనక్కి వెళ్లిందని చెప్పారు.

మూడు గంటల పాటు..

భట్టిప్రోలు: కొల్లూరులో జరిగిన ప్రజాగళం కార్యక్రమంలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు వేమూరు మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్ద సాయంత్రం 4.30 నిమిషాలకు హెలికాప్టర్‌లో దిగారు. అక్కడి నుండి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర అడుగడుగునా ప్రజలకు అభివాదం చేస్తూ.. 5.30 నిమిషాలకు సభా వేదికకు చేరుకున్నారు. చంద్రబాబు కొల్లూరుకు చేరుకోగానే.. జనాన్ని బస్టాండ్ సెంటర్లో పోలీసులు బారికేడ్లతో జనాన్ని నిలిపివేయడంతో ప్రజలు ఆగ్రహించి భారీ గేట్లను పోసుకొని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఉన్నతాధికారులు స్పందించి.. పోలీసులతో బారికేడ్లను తొలగించడంతో జనం అంతా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

ఇరుకు బజారుతో ప్రజలు అవస్థలు

కొల్లూరులో ప్రజాగళం కార్యక్రమం సభా వేదిక ఇరుకు బజారు కావడంతో ప్రజలు ఉక్కపోతకు గురై నానా అవస్థలు పడ్డారు. దీనికి తోడు కార్యక్రమం కూడా రెండు గంటల పాటు ప్రసంగాలతో కొనసాగడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఐదు గంటల 30 నిమిషాలకు ప్రారంభమైన ప్రసంగాలు ఏడు గంటల 25 నిమిషాలకు ముగిసింది.

'వన్ టౌన్' వద్ద ఉద్రిక్తత..

(మొదటిపేజీ తరువాయి)

వద్దకు వచ్చారని.. పలువురు వైసిపి కార్యకర్తలను అరెస్టు చేశారని తెలియడంతో నగరంలోని పలువురు వైసిపి కార్యకర్తలు పెద్దసంఖ్యలో పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు పోలీసులు కూడా పెద్ద సంఖ్యలో మొహరించారు. దీంతో అక్కడ ఏం జరుగుతుందో ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించే వారికి అర్థం కాలేదు.

దామచర్లే నీచుడు..

'ఆడవాళ్లను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నానని దామచర్ల జనార్దన్ నన్ను విమర్శిస్తున్నాడు. నిజమైన నీచుడు దామచర్ల జనార్ధనే..' అంటూ బాలినేని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి తన కోడలు సమతానగర్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిందని, అక్కడ టిడిపికి చెందిన మహిళ అడ్డుకుందని, అయితే తమ వాళ్లు వేరే ఇళ్లకు వెళ్లారని, అక్కడ కూడా అడ్డుకున్నారని చెప్పారు. అక్కడున్న రిజైన్ చేసిన వాలంటీర్‌ను దుర్భాషలాడుతుంటే తన కోడలు అడ్డుకోవడంతో ఆమెను బూతులు తిట్టారని చెప్పారు. ఇవన్నీ తెలియకుండా దామచర్ల జనార్ధన్ తాను కుటుంబాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నానడం సిగ్గుచేటన్నారు. 'ఆయన కూతుర్ని ఎవరైనా తిడితే ఊరుకుంటారా.!' అని ప్రశ్నించారు. జనార్ధన్‌కు సిగ్గుండాలని ఉద్ఘాటించారు. తన కుటుంబం జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 30 ఏళ్ల నుంచి రాజకీయాలు చేస్తున్నానని, కుటుంబాన్ని రోడ్డున పడేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. మా ఇళ్లకొచ్చి కొడతానని జనార్ధన్ అంటున్నాడని, మా ఇంటికొచ్చి 'వాడు' కొడతాడా.? అంటూ ధ్వజమెత్తారు. సమతానగర్‌లో ఘర్షణకు కారణమైన మహిళ ఓ కానిస్టేబుల్ భార్య అని, సదరు కానిస్టేబుల్‌ను ఇంతవరకు ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు.

ఎలక్షన్ కమిషన్ మెప్పు కోసం పనిచేస్తున్నారా.?

అధికార పార్టీ వాళ్లను టార్గెట్ చేయడం ద్వారా ఎన్నికల కమిషన్ మెప్పు పొందవచ్చునట్లు జిల్లా ఎస్పీ, కలెక్టర్ వ్యవహరిస్తున్నారని బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శించారు. తెలుగుదేశం పార్టీ వాళ్ల ప్రచారంలో ముగ్గురు ఆర్పీలు పాల్గొన్నారని తాము ఫిర్యాదు చేసినా ఇంతవరకు కలెక్టర్ చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా ఎస్పీ ఆఫీసు వద్ద టిడిపి వాళ్లు ధర్నా చేసినా ఎస్పీ స్పందించలేదన్నారు. వైసిపి వాళ్లను మాత్రం అరెస్టులు చేసి కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్సలు ఏం జరుగుతోందంటూ ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపితో టిడిపి పొత్తు ఉందని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇలా చేస్తున్నారా.? అని ఆరోపించారు. కేవలం అధికార పార్టీ వాళ్లను మాత్రమే టార్గెట్ చేయడం చూస్తుంటే తమకేదో అనుమానంగా ఉందన్నారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్ కూడా విచారణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఇంటర్‌లో బాలికలదే హవా..

(మొదటిపేజీ తరువాయి)

6193 మంది ఉత్తీర్ణులై 78శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఒకేషనల్ కోర్సులలో 2001 మంది పరీక్షలకు హాజరు కాగా 1373 మంది ఉత్తీర్ణులై 53 శాతం ఉత్తీర్ణతను సాధించారు. వీరిలో బాలురు 956 మంది హాజరు కాగా 604 మంది పాసై 63 శాతం, బాలికలు 1045 మంది హాజరు కాగా 789 మంది పాసై 74 శాతం ఉత్తీర్ణను అందుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి: రిటర్నింగ్ ఆఫీసర్

ప్రజాశక్తి-గిద్దలూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ ఆఫీసర్ నాగజ్యోతి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తాయిలాలకు ప్రలోభపడి ఓటును అమ్ముకోవద్దని సూచించారు. ఓటరుగా నమోదు కాని వారందరూ ఈ నెల 15వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు.

15న వికలాంగులకు ఉచిత నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: మండలంలోని మూడు సంవత్సరాల వయసు నుంచి 17 సంవత్సరాల వయసు ఉన్న దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఈ నెల 15వ తేదీన మార్కాపురంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి పి ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ పంపిణీ జరుగుతుందని తెలిపారు. మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలో ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులు నిర్ణీత తేదీలో హాజరు కావాలని కోరారు. ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉచిత భోజన వసతి, రవాణా భత్యం అందజేయనున్నట్లు తెలిపారు. భవిత కేంద్రాలలో పని చేస్తున్న రిసోర్స్ టీచర్లు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు తప్పనిసరిగా వారి పరిధిలోని దివ్యాంగులను ఈ శిబిరానికి హాజరయ్యేలా చూడాలని కోరారు. వికలాంగ విద్యార్థిని ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు ఫొటోలతో హాజరుకావాలని అన్నారు.

ఇసుక అడిగితే..శవాన్ని కూడా తెచ్చారు..

ఈపురిపాలెం పద్మనాభునిపేటలో ఘటన

ప్రజాశక్తి-చీరాల

ఇంటి నిర్మాణం కోసం ఓ మహిళ ఇసుకను తోలించుకుంటే ఇసుకతో పాటు ఓ వికలాంగుడి మృతదేహం కూడా వచ్చిన ఘటన చీరాలలో శుక్రవారం వెలుగుచూసింది. ఈపురిపాలెం పద్మ నాభునిపేటలో నివాసముంటున్న కె.రాం బాబు, లక్ష్మి దంపతులు నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇంటి బేస్ మట్టం ఫిల్ చేసేందుకు 10 ట్రక్కుల ఇసుక అవసరం కావటంతో ఇటీవల ఓ కాంట్రాక్టర్‌కు చెప్పారు. సదరు కాంట్రాక్టర్ బోయినవారిపాలెం గ్రామ శివారులోని సమాధుల వద్ద ఇసుకను అక్రమంగా జెసిబి ద్వారా తరలించారు. శుక్రవారం ఇంటి పని చేసేందుకు కోసం జెసిబిని తెచ్చి కూలీలు బేస్‌మట్టం నింపుతుండగా అందులో నుండి ఒక్కసారిగా తల లేని మతదేహం బయటపడింది. దీంతో భయ భ్రాంతులకు గురైన కూలీలు విషయాన్ని ఇంటి నిర్వాహకురాలు లక్ష్మికి తెలియ జేశారు. వెంటనే ఆమె పోలీసులకు సమా చారం అందించడంతో విషయం వెలుగు



ఇసుకలో ఉన్న మృతదేహం

లోకి వచ్చింది. ఇసుకలో బయటపడ్డ మతదేహం ఓ వికలాంగుడిదిగా పోలీసులు గుర్తించారు. ఇటీవల చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. జెసిబితో ఇసుక తోలే క్రమంలో తలతెగిపోయే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. అందిన పిర్యాదు మేరకు రూరల్ నిమ్మగడ్డ ప్రసాద్ సంఘటనాస్థలానికి చేరుకొని మతదేహాన్ని పరిశీలించారు. ఇంటి నిర్వహుకుల నుండి వివరాలు సేకరించారు. ఈ తరుణంలో మతదేహం ఎక్కడిది? అసలు ఇసుక ఎక్కడ నుండి తరలించారు? అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. ఈపురిపాలెం ఎస్సై శివశంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్యాప్తు చేస్తున్నాం..
రూరల్ సీఐ సత్యనారాయణ

ఇంటి కోసం ఇసుక తోలించుకుంటే అందులో మతదేహం వచ్చిందని లక్ష్మీ అనే మహిళ పిర్యాదు చేయటంతో మతదేహాన్ని పరిశీలించాం. సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన వికలాంగ యువకుడిగా గుర్తించాం. ఇసుక ఎక్కడ నుండి తెచ్చారనే విషయంపై కాంట్రాక్టర్ నుండి వివరాలు సేకరిస్తున్నాం. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలిస్తున్నాం.. మరిన్ని విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

ర్యాండమైజేషన్‌లో ఈవీఎంల కేటాయింపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈవిఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీ దినేష్ కుమార్ చేపట్టారు. తొలుత ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి, తరువాత జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆన్‌లైన్ ద్వారా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.



ఈవీఎంలను కేటాయిస్తున్న బాపట్ల కలెక్టర్

శ్రీలత, వైసి.పి ప్రతినిధి డి. క్రాంతికుమార్, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి మొగల్ కాలేషా బేగ్, ఐపి అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్‌కె రసూల్, బిజెపి ప్రతినిధి రాజశేఖర్, బిఎస్‌పి ప్రతినిధి ఎర్రయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి సుదర్శన్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ భాషా శుక్రవారం నిర్వహించారు. కలెక్ట రేట్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వ హించారు. తొలుత బాపట్ల లోక్‌సభ నియోజకవర్గానికి, తరువాత జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆన్ లైన్ ద్వారా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వు ఈవీఎం లను కూడా కేటాయించారు. ఈ ప్రక్రియ ను రాజకీయపార్టీల ప్రతినిధుల సమ క్షంలో కలెక్టర్ పూర్తి చేశారు. కార్యక్రమంలో జేసీ శ్రీధర్, జిల్లా రెవిన్యూ అధికారి సత్తిబాబు పాల్గొన్నారు.

15 నుంచి హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన సూచనలు, సలహాలను ఇచ్చేందుకు జిల్లాలోని అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఈ నెల 15వ తేదీ నుండి హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా నామినేషన్ల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థుల సౌకర్యార్థం మరియు అవసరమైన సూచనలు, సలహాలను ఇచ్చేందుకు జిల్లాలోని అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఈ నెల 15 నుండి 17 వరకు 3 రోజుల పాటు హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని నామినేషన్ పత్రాల సమర్పణలో ఏమైనా సందేహాలు వుంటే హెల్ప్ డెస్క్ నుండి అవసరమైన సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ ఎన్నికల సంఘం నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకోవాలని, జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసేందుకు సహకరించాలని కోరారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈనెల 14వ తేదీ వరకు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఈ నెల 11 నాటికి 18 లక్షలా 17 వేలా 162 మంది ఓటర్లు జాబితాలో ఉన్నారన్నారు. ఇప్పటివరకు వచ్చిన ఫారం-6 దరఖాస్తులను పరిష్కరించగా, 5 వేల 389 దరఖాస్తులు ఇంకా పెండింగ్ ఉన్నాయన్నారు.

నియమావళి అతిక్రమిస్తే చర్యలు
ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్

వివిధ రాజకీయ పార్టీల వారు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుకోవా లని, ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియ మావళిని అతిక్రమిస్తే ఎన్నికల నిబం ధనల మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంతో కోడ్ ఉల్లంఘన పై సి-విజిల్ యాప్ ద్వారా ప్రజలు, రాజకీయ పార్టీలు పిర్యాదులు చేస్తున్నారన్నారు. ఎన్నికల ఉల్లంఘన పై పిర్యాదులు చేయడడానికి 9121102266 ఫోన్ నెంబర్ ను కూడా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఆర్.శ్రీలత, వైసిపి ప్రతినిధి క్రాంతికుమార్, టిడిపి ప్రతినిధి మొగల్ కాలేషా బేగ్, కాంగ్రెస్ ప్రతినిధి ఎస్‌కె రసూల్, బిజెపి ప్రతినిధి జి. రాజశేఖర్, బిఎస్‌పి ప్రతినిధి ఎర్రయ్య కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

విధులపై అవగాహన అవసరం

మాస్టర్ ట్రైనర్లకు సూచించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే ప్రతి ఒక్కరూ వారి విధులపై అవగాహన ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. అందుకే ఈ దిశగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాస్టర్ ట్రైనర్లు, మెంటార్లతో శుక్రవారం స్పందన హాలులో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. శిక్షణ కార్యక్రమాల్లో వీరు గుర్తించిన అంశాలు, లోపాలు, వాటిని సరిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై అభిప్రాయాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఈ నెల 5, 7 తేదీలలో పిఒలు, ఎపిఒలకు మొదట విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించామని, రెండో విడత శిక్షణ కార్యక్రమం ఈనెల 13, 14 తేదీలలో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, డిఆర్ఓ ఆర్. శ్రీలత, పోస్టల్ బ్యాలెట్ల జిల్లా నోడల్ ఆఫీసర్ వి.విశ్వేశ్వరరావు, నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షల వివరాలను పరిశీలిస్తున్న భగవాన్‌నాయక్

వైద్య పరీక్షలపై కలెక్టర్‌కు నివేదిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల విధులకు సంబంధించి మెడికల్ గ్రౌండ్స్‌లో మినహాయింపు కోరుకున్న సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక అందజేసినట్లు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల విధులకు సంబంధించి మెడికల్ గ్రౌండ్స్‌లో మినహాయింపు ఇవ్వాలని కోరుకున్న సిబ్బంది 45 మందికి మెడికల్ బోర్డు తగు పరీక్షలు నిర్వహించి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారని, ఈ మేరకు శుక్రవారం ఉదయం 45 మందికి డాక్టర్ల బందం పరీక్షలు నిర్వహించి.. తగు నివేదిక అందించినట్లు తెలిపారు. ఈ పరీక్షలను సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ హనుమంతరావు, మెడికల్ రికార్డ్ ఆఫీసర్ నరసింహారావు పర్యవేక్షించారు.



నాయకులను అభినందిస్తున్న కలెక్టర్

ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డాక్టర్ అంబేద్కర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ మరియు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అభినందనలు తెలి పారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అసోసియేషన్ ఏర్పా టు గురించి తెలిపారు. అందరూ మంచి సమాజం కోసం పని చేయాలని కలెక్టర్ సూచించారు. డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలు పురస్కరించుకొని పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం 13న బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అనాటమీ హెచ్‌ఒడి మరియు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డా సుధాకర్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు మరియు కార్యవర్గ సభ్యులు వున్నారు.



దర్శి డీఎస్పీకి అర్జీ ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు

దళితుడిపై పెట్టిన కౌంటర్ కేసును ఎత్తేయాలి

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

త్రిపురాంతకం మండలం ఎండువారిపాలెం గ్రామానికి చెందిన దళితుడైన యామర్తి త్రిపురాంజనేయులపై పెట్టిన కౌంటర్ కేసు ఎత్తివేయాలని, దళితుడిపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురాం డిమాండ్ చేశారు. దళితుడిపై కౌంటర్ కేసు ఎత్తివేయాలని కోరుతూ దర్శి డివిఎస్‌పి అశోక్ వర్ధన్‌కు బాధితుడైన త్రిపురాంజనేయులతో కలిసి శు క్రవారం వినతి పత్రం అందజేశారు. ఎండువారిపాలెం గ్రామానికి చెందిన పెత్తందారులైన తోట గోవర్ధన్, బాసిపోయిన పేరయ్యలు మార్చి 20న త్రిపురాంజనేయులుమీద దాడి చేయడం జరిగిందన్నారు. ఆయన అప్పటి నుంచి ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. ఈవిషయంపై త్రిపురాంజనేయులు కుటుంబసభ్యులు ఎస్సీ, ఎస్టీ కేమోదు చేయాలని పోలీసులను కోరుతున్నా వారు వెంటనే పట్టించుకోలేదన్నారు. చాలా రోజులతరువాత పెత్తందారులమీద ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన పోలీసులు ప్రతిగా అదేరోజు రాజకీయ నాయకుల సిఫార్సుల మేరకు త్రిపురాంజనేయులమీద కౌంటర్ కేసు నమోదు చేయడం జరిగందన్నారు. డిఎస్పీ విచారణ జరిపి త్రిపురాంజనేయులమీద కౌంటర్ కేసు ఎత్తివేసి , దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్పీని కలిసిన వారిలో బాధితుడితోపాటు ఎండువారిపాలెం గ్రామానికి చెందిన పాకనాటి ఆనందరావు, తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీ కొన్న లారీ

ఒకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-మద్దిపాడు



గాయపడిన వ్యక్తి

వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుండి లారీ ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని వెల్లంపల్లి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మద్దిపాడు-వెల్లంపల్లి మధ్యలో గల బొమ్మిడాల టుబాకో ఎదురుగా హైవే వారికి సంబంధించిన నీళ్ల ట్యాంకర్ చెట్లకు నీళ్లు పోస్తున్న క్రమంలో గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీ వెనక నుండి ఢీకొట్టడంతో లారీడ్రైవర్ క్యాబిన్లో ఇరుక్కుపోయాడు. పోలీసులు, స్థానికులు క్షతగాత్రుని బయటకు తీసి 108 వాహనం ద్వారా ఒంగోలు జిజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

70వ సారి రక్తదానం

ప్రజాశక్తి-ఒంగోలు



రక్తదానం చేస్తున్న థామస్

ఎంఎంఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు మక్కెన థామస్ శుక్రవారం 70వ సారి రక్తదానం చేసి.. మానవత్వాన్ని మరోసారి చాటారు. జిజి హెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి అత్యవసర పరిస్థితు ల్లో రక్తం అవసరం పడటంతో సోషల్ మీడియా ద్వారా సమాచారం అందుకున్న ఆయన జిజిహెచ్‌కు వెళ్లి.. రక్తదానం చేశారు. దీనితో కలిపి ఇప్పటికి మొత్తం 70 సార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్ కుటుంబసభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఇంకొల్లు శ్రీ గౌతమి విద్యార్థులు

'శ్రీ గౌతమి' విజయ పరంపర

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఇంటర్మీడిట్ ఫలితాల్లో శ్రీ గౌతమి విద్యార్థులు విజయ పరంపర కొనసాగించారు. ప్రథమ సంవత్సరంలో కె సాహితి 462, కె జయలక్ష్మి 458, షేక్ రిజ్వానా 457 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో మీరాకుమారి 981, లోక రమ్య 973, ఇష్రత్ 969 మార్కులు సాధించి కళాశాల ప్రతిభను చాటారని శ్రీ గౌతమి డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.



ఇంకొల్లు ఆదర్శ విద్యార్థులు

ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఇంటర్ ఫలితాల్లో ఆదర్శ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 16 మంది విద్యార్థులు 400కుపైగా మార్కులు సాధించారు. ఆర్ కౌషిక్ 459, ఆర్ గీతామాధురి 456, ఝాన్సి 452, ఆశిష్ నెహారా 445, అంబిక 438, శివన్నారాయణ 437 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 900కుపైగా నలుగురు విద్యార్థులు మార్కులు సాధించారు. నాగమల్లిక 965, పవిత్ర 965, అనుశ్రీ 910, అక్మల్ రాజ 908 మార్కులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. ప్రిన్సిపల్ శివప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



విజయకేతనం చూపుతున్న వీరిశెట్టి విద్యార్థులు

'వీరిశెట్టి' విజయ దుందుభి

ప్రజాశక్తి - పొదిలి

ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో శ్రీ వీరిశెట్టి జూనియర్ కళాశాల, బిట్స్ విద్యాసంస్థల విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో జి రమ్యకృష్ణ 462 మార్పులు సాధించి స్టేట్ 5వ ర్యాంకు, రెండవ సంవత్సరం ఫలితాల్లో మద్దుల డింపుల్ 983 మార్కులు పొంది స్టేట్ 7 ర్యాంకు, ఎంపీసీ మొదటి సంవత్సరంలో షేక్ నజీరా భాను 459, కె రోహిత్ కుమార్ 455, ఫస్ట్ ఇయర్ బైపిసిలో టి స్నేహరెడ్డి 419, సీఈసీ ఫస్టియర్ ఎస్ వెంకటపద్మ 466, పి నందిని 459, సెకండ్ ఇయర్ ఎంపీసీలో ఎం కావ్య 974, షేక్ తస్లీమ్ 973, ఎ నిఖిల్ 960, బైపిసి సెకండియర్ నందు షేక్ అస్ఫైపుల్ సిద్ధిక్ 911, సిఇసి సెకండ్ ఇయర్ 898మార్కులు సాధించి కళాశాలను ప్రగతి పథంలో నడిపించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

జూనియర్ ఇంటర్‌లో బిఎఆర్ ఫస్ట్

ప్రజాశక్తి - పర్చూరు

ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి పరీక్షా ఫలితాల్లో బిఎఆర్ జూనియర్ కళాశాలకు చెందిన షేక్ సమీర 448 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ చింపారెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.



షేక్ సమీర

రాయల్ విద్యార్థులదే అగ్రస్థానం

ప్రజాశక్తి - అద్దంకి



ఎన్ పూర్ణచంద్రరావు



నందిని

అత్యుత్తమ ఫలితాలతో స్థానిక రాయల్ జూనియర్ కాలేజిని ప్రథమ స్థానంలో నిలిపిన విద్యార్థులు, అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షా ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఫలితాల్లో ఎంపిసి విభాగంలో కంచుగంటి నందిని 465మార్కులతో పట్టణం ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ తన్నీరు శ్రీనివాసరావు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో ఎన్ పూర్ణచంద్రరావు 988, వి పుష్పాంజలి 987 మార్కులతో పట్టణ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని డైరెక్టర్ రాఘవ తెలిపారు. మొదటి సంవత్సరం 203మంది ఉత్తీర్ణతతో 93.98 శాతం, ద్వితీయ సంవత్సరం 221మందితో 94 శాతం చొప్పున ఉత్తీర్ణత సాధించామని కరస్పాండెంట్ పోలవరపు శ్రీనివాసరావు తెలిపారు.

అగ్రగామిగా శ్రీ వివేకానంద విద్యార్థులు

ప్రజాశక్తి - పొదిలి



ఆనందంతో వివేకానంద విద్యార్థులు

ఒఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో శ్రీవివేకానంద విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. కళాశాల కరస్పాండెంట్ కెవి రమణారెడ్డి, డైరెక్టర్ వై వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ బోనం శ్రీనివాసరెడ్డి అధ్యాపకేతర బృందం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులతో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. గూడూరి వినోద్ కుమార్తె గూడూరి మనస్విని పట్టణ ప్రథమ స్థానం సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎన్ పల్లవి 987, పి దివ్య 979, బి కౌసల్య 971, ద్వితీయ సంవత్సరం బైపిసిలో ఎన్ మహేశ్వరీ 984, ఎం శరణ్య 980, ద్వితీయ సంవత్సరం సిఈసీలో కె రజిత 941, మొదటి సంవత్సరం ఎంపీసీలో కె సాయికృష్ణారెడ్డి 461, ఎస్‌కె రబ్బానీ మస్కాన్ 459, ఎన్ పూజిత 453. మొదటి సంవత్సరం బైపీసీలో జి మనస్వి 428, ఆర్ మధురాగిణి 427, కె ఆదిలక్ష్మి 420, మొదటి సంవత్సరం సీఈసీలో పి అరవింద 440, ఎం కావ్య 432, సీహెచ్ రమ్య 420 మార్కులు సాధించారు.

యశ్వంత్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బేస్తవారిపేట



లావణ్య



జి మను తేజ

యశ్వంత్ జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ ఫలితాల్లో బైపీసీలో లావణ్య 980మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. ఎంపీసీలో జి మను తేజ 979 మార్కులతో ద్వితీయ స్థానం, జి ఉష్రశ్రీ 976తో 3వ స్థానంలో, టీ ధరణి 972 మార్కులు సాధించి 4వ స్థానంలో నిలిచారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 417 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన వినీతను డైరెక్టర్ గౌరీ కృష్ణారెడ్డి అభినందించారు.

సత్తా చాటిన ప్రభుత్వ విద్యార్థులు

ప్రజాశక్తి - యద్దనపూడి



ఎం చైతన్య



భవాని శంకర్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ మీర్మిడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. గురుకుల పాఠశాలకు చెందిన ఎం ధరణి, జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 440, సీనియర్ ఇంటర్ ఎంపిసిలో ఎం చైతన్య 944 మార్కులు, జూనియర్ బైపిసిలో కీర్తన 407, సీనియర్ బైపిసిలో అమూల్య 969 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జూనియర్ ఎంపిసిలో భవాని శంకర్ 400, సీనియర్ ఎంపిసిలో అఫ్రీద్ 920 మార్కులు సాధించారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి రత్న కుమారి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల తెలిపారు.

సూర్యలంకలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - బాపట్ల



సూర్యలంకలో పర్యాటకులు

సూర్యలంకలో పర్యాటకుల సందడిచేశారు. రంజాన్ పండుగ అనంతరం సూర్యలంక బీచ్‌కి ముస్లింలు సముద్ర స్నానాలకు శుక్రవారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తీరంలో రూరల్ సీఐ శ్రీహరి తన సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారు. స్నానాలు చేసేవారు లోతుకి వెళ్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు

ప్రజాశక్తి - అద్దంకి



నరిశెట్టి మారుతీకుమార్



కరి హరిత

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శ్రీ సాధన కాలేజీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ బి నాగార్జున తెలిపారు. ఎంపీసీలో పంగులూరుకు చెందిన పోతుగంటి చరిష్మా 457, ముప్పవరంకు చెందిన ఉదయగిరి మౌనిక 449, నార్నెవారిపాలెంకు చెందిన నామాతోటి శ్రీవేణి 437 మార్కులతో కాలేజీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో పంగులూరుకు చెందిన జజ్జర కావ్య 367 అత్యధిక మార్కులు సాధించిందని అన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో నరిశెట్టి మారుతీ సుకుమార్ 960, తెలగతోటి ఉదయకుమార్ 960, కరి హరిత 956, చిలక నాగమల్లేశ్వరి 956, సీనియర్ బైపిసిలో నూతలపాటి శ్రీవల్లి 933 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 90శాతం, సీనియర్ ఇంటర్లో 94శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. సాధారణ విద్యార్థులతో గొప్ప ఫలితాలు సాధించడంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషికి తగిన ఫలితం దక్కిందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు.

శ్రీ గౌతమి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్



మల్లెబోయిన శ్రీరామ్



ఈదర వెంకట ప్రశాంత్‌రెడ్డి



వెన్న హారిక


ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి విభాగంలో మల్లెబోయిన శ్రీరామ్ 976, ఈదర వెంకట ప్రశాంత్‌రెడ్డి 974, బైపిసిలో వెన్న హారిక 960 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో పృధ్వి తారక వెంకటశివ 455మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 900మార్కులపైన 12 మంది విద్యార్థులు సాధించారు. మొదటి సంవత్సరంలో 400మార్కులపైన 14మంది విద్యార్థులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను విద్యా సంస్థల ఛైర్మన్ కనుమర్ల గుండారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్‌వి సత్యనారాయణ, విద్యా సంస్థల పర్యవేక్షకులు కనుమర్ల శ్రీరామ్‌రెడ్డి అభినందించారు.

ఎస్‌ఎస్‌ఎన్ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - పొదిలి



నిశనం ప్రత్యూష్



పొన్నరసు దివ్య



కదమ భానుప్రియ

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ఎస్‌ఎస్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో కాలేజీకి చెందిన నిశనం ప్రత్యూష్ 427 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో పొన్నరసు దివ్య 314, సిఇసి విభాగంలో కదమ భానుప్రియ 443మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో వెలిగండ్ల లిఖిత 884మార్కులు, బైపీసీ విభాగంలో అంబూరి కావేరి 812 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

విజిఆర్‌ఎం విద్యార్థుల విజయకేతనం



కె చంద్రిక



ఫ్లొరెన్స్ నైటింగేల్



ఆర్ సంధ్య

ప్రజాశక్తి - బాపట్ల

ఇంటర్ ఫలితాల్లో పట్టణంలో విజిఆర్‌ఎం జూనియర్ కళాశాల విద్యార్థిని కె ఐశ్వర్య ఎంపీసీలో 986 మార్కులతో టౌన్ ఫస్ట్ నిలిచారు. ఓ శ్రీలత బైపిసిలో 980 మార్కులు సాధించారు. చుండూరు అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు బి సుధీర్ బైపిసిలో 927 మార్కులు, ఎ సియోను ఎంపీసీలో 897 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. బాపట్ల అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు ఆర్ సంధ్య బైపీసీలో 964, కె చంద్రిక ఎంపీసీలో 972, ఫ్లొరెన్స్ నైటింగేల్ బైపీసీలో 946 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ కె భవానిదేవి తెలిపారు. సీనియర్ ఇంటర్లో వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూరు శాతంతో ప్రథమ స్థానం, బాపట్ల బధిరుల ఆశ్రమ జూనియర్ కళాశాల 84 శాతంతో రెండో స్థానం, రేపల్లె జిజెసి 78శాతంతో మూడో స్థానం, చందోలు జిజేసీ 73.8శాతం ఉత్తీర్ణతతో నాలుగో స్థానంలో నిలిచాయి. జూనియర్ ఇంటర్లో బాపట్ల బధిరుల ఆశ్రమ కళాశాల 96శాతంతో మొదటి స్థానం, చందోలు జూనియర్ కళాశాల 64శాతంతో రెండవ స్థానం, సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 61.73 శాతంతో మూడో స్థానం, వేమురు జిజెసి 60శాతంతో నాలుగో స్థానంలో నిలిచాయి. జిల్లాలో జూనియర్ ఇంటర్లో బాలురు 53శాతం, బాలికలు 58 శాతం, మొత్తంగా 61శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్లో బాలురు 65శాతం, బాలికలు 78శాతం, మొత్తంగా 71శాతం ఉత్తీర్ణ సాధించారు. వృత్తి విద్యా కోర్సుల్లో మొదటి సంవత్సరం ఇంటర్లో బాలురు 45శాతం, బాలికలు 68శాతం, మొత్తం 61శాతం, సీనియర్ ఇంటర్ వృత్తి విద్య కోర్సులో బాలురు 45 శాతం, బాలికలు 81శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్మీడియట్ అధికారులు తెలిపారు.



కె ఐశ్వర్య



ఓ శ్రీలత

ప్రజా సేవే ధ్యేయం : చెవిరెడ్డి

ప్రజాశక్తి-దర్శి

ప్రజా సేవ తమ ధ్యేయమని వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక బూచేపల్లి నివాసం వద్ద చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆత్మీయ పరిచయ కార్యక్రమంలో వైసిపి దర్శి నియోజకవ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో కలిసి దర్శి నియోజక వర్గాన్ని అభివద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి దర్శి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 2004 నుంచి తమ కుటుంబం దర్శి నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూ అన్ని విధాల చేతోడుగా ఉంటున్నామన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు కుమ్మిత అంజిరెడ్డి, వైసిపి నాయకులు తిరుపతిరెడ్డి, డాక్టర్ దేవదానం పాల్గొన్నారు. తాళ్లూరులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆత్మీయ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు జడ్‌పిటిసి మారం వెంకట్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, గొల్లపాటి మోషే, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

కురిచేడు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గుంటక నాసర్‌రెడ్డి కల్యాణ మండపంలో చెవిరెడ్డి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. తాను ప్రకాశం జిల్లా వాసులకు సేవలు అందించడానికి జగన్ మోహన్ రెడ్డి తనను ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా కేటాయించినట్లు తెలిపారు. తొలుత సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అందరికీ పరిచయం చేశారు. అనంతరం వైసిపి దర్శి నియోజక అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపిపిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, జడ్‌పిటిసి నుసుం వెంకటనాగిరెడ్డి, మాజీ ఎంపిపి వీరగంధం కోటయ్య, వైసిపి మండల నాయకులు బెల్లం చంద్రశేఖరరావు, మేరువ సుబ్బారెడ్డి, కురిచేడు సర్పంచి కేశనపల్లి క్రిష్ణయ్య, బయ్యవరం సర్పంచి నాగేశ్వరరావు, పడమర గంగవరం సర్పంచి కాసు భాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జివి. కొండారెడ్డి

బిజెపి కూటమిని ఓడించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి

ప్రజాశక్తి- కొత్తపట్నం

ఎన్నికల్లో బిజెపి కూటమిని ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి తెలిపారు. సిపిఎం మండల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో బిజెపిని, దాని మిత్ర పక్షాలను ఓడించాలన్నారు. ఇండియా కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. ఆ దిశ కార్యకర్తలు పనిచేయాలని కోరారు. బిజెపికి కొమ్ముకాస్తూ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న వైసిపి ఓడించాలన్నారు. ఇండియా కూటమి అభ్యర్థుల పరిచయ కార్యక్రమాని నిర్వహించిన ప్రజలకు పరిచయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్. సోమిరెడ్డి, మండల నాయకులు పట్టపు ప్రకాశం,చలపతి, పుచ్చలపల్లి శ్రీను, పట్టపు ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

చంద్రబాబుతోనే రాష్ట్రాభి వృద్ధి సాధ్యమని టిడిపి కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి నగర పంచాయతీలోని ఎనిమిదో వార్డులో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. తొలుత దద్దానమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను నిత్యం అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివద్ధి కోసం కషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు తమ పార్టీద అధికారం లోకి వస్తే మద్యపానాన్ని నిషేదిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయలేదన్నారు. 34 శాతం కల్తీ మద్యం అమ్ముతూ కోట్లు గడిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచా యతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మహిళా నాయకురాలు శోభారాణి, దారం సుబ్బారావు, నారాయణరెడ్డి, పుప్పాల కొండయ్య పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి



వెంకటేష్‌కు మద్దతు తెలుపుతున్న యువత

కరణంకు మద్దతు తెలిపిన యువత

ప్రజాశక్తి-చీరాల

మండల పరిధిలోని కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలోని తులసీనగర్ గ్రామ నాయకులు వైసిపి చీరాల నియోజక వర్గ అభ్యర్థి కరణం వెంకటేష్‌కు మద్దతు తెలిపారు. చీరాల పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సమక్షంలోకరణం వెంకటేష్‌ను శుక్రవారం కలిసి తమ మద్దతును తెలియజేశారు. అదేవిధంగా వేటపాలెం పంచాయతీ మాజీ సర్పంచి కర్పూర రమాదేవి పలువురు నాయకులతో కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి- పామూరు

జిల్లాలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. సిపిఎం మండల కమిటీ సమావేశం స్థానిక సుందరయ్య భవనంలో సయ్యద్ గౌస్ బాషా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులు వెంటనే పరిష్కార మార్గం చూడాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ప్రతి సంవత్సరం నీటి సమస్య పెరుగుతుందన్నారు. ఎన్నికల్లో పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారని ఆరోపించారు. భూగర్భజలాలు అడుగంటడంతో బోరు నుంచి నీరు రావడం లేదని తెలిపారు. ఫలితంగా నీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ వద్దల ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చేపలు పట్టుకొనేందుకు చెరువుల్లోని నీటి బయటకు వదిలి పెట్టడం దుర్మార్గమని తెలిపారు. ఎండల తీవ్రతను దష్టిలో పెట్టుకొని అధికారులు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. నీటి ఎద్దడి నెలకొన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కె.మాల్యాద్రి, ఎస్.అల్లాభక్షు, ఎం. రామయ్య, సిహెచ్.వెంకటేశ్వర్లు, కాలే శంకర్, వీరనారాయణ , బి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దామచర్ల సత్య

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

టంగుటూరు మండలం జయవరం గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో బొద్దు సాల్మన్ రాజు, యరజర్ల రవికుమార్, యరజర్ల ఆంజనేయులు, పెరబత్తిన శ్రీను, కొమ్ము సురేంద్ర, చుండి ప్రవీణ్ కుమార్, చాట్రగడ్డ రామయ్య, చుండి భాస్కర్ బాబు, పెద్దకత్తుల వెంకటేష్, పెద్దకత్తుల పున్నయ్య, పెద్దకత్తుల శ్రీను, పెద్దకత్తుల యేసు రత్నం, కళ్ళగుంట కొండయ్య, కళ్ళగుంట కష్ణ, కొమ్ము అబ్రం, చుండి దావీదు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి టంగుటూరు మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్ , బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎంఎం.కొండయ్య

పేదల సంక్షేమానికి కృషి : కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

నారా చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు టిడిపి చీరాల నియోజకవర్గ అభ్యర్థి ఎంఎం.కొండయ్య తెలిపారు. అందులో భాగంగానే సూపర్ సిక్స్ పథకాలను తెచ్చినట్లు తెలిపారు. పజాగళం ఎన్నికల శంఖారావంలో భాగంగాఎంజెసి క్లాత్ మార్కెట్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వస్త్ర వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను తెచ్చినట్లు తెలిపారు. వ్రస్త్ర వ్యాపారులందరూ తనకు మద్దతు తెలియజేసి సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని గవినినవారిపాలెం ఈగవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టలో తన కుమారుడు గౌరీ అమర్నాథ్‌తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో 100 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-పామూరు

విజయవాడలో వివిధ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న కనిగిరి ప్రాంత వాసులతో కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ నివాసంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కుమారుడు జయసింహారెడ్డి, బైరెడ్డి జయరామిరెడ్డి, మోరు బోయిన గంగరాజు యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారపనేని చంద్రశేఖర్, మాజీ ఎంపిటిసి చెనికల పెదమాల కొండయ్య ఆధ్వర్యంలో 100 కుటుంబాల వారు టిడిపిలో చేశారు. జయసింహారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జయసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజక వర్గం అభివృద్ధి చెందాలంటే డాక్టర్ ఉగ్రను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని పెద్దపులుగువారిపాలెం, కట్టావాద, మర్రికట్టవ, నర్రావారిపాలెం, తుమ్మలపల్లిలో టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి లేదని, రోడ్ల సౌకర్యాలు లేవని, తాగునీరు, సాగు నీరు అసలు లేవని అన్నారు. పెదపులుగువారిపాలెం అంటే తన సొంతూరితో సమానమన్నారు. ఒరుగంటి రెడ్లు అధికారంగా ఉన్న ఈ ప్రాంతం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. తన సొంత నిధులతో రవాణాకి అయ్యే రూ.5 మాత్రమే తీసుకుంటూ ఊరి ప్రజల దాహార్తిని కొన్నేళ్లుగా తీరుస్తుంటే, ఎంఎల్‌ఎ కోన రఘుపతి దీన్ని కూడా రాజకీయం చేయడమే కాకుండా తనపై విమర్శలు చేశారని అన్నారు. తనది పెట్టే చెయ్యే గాని సహాయాన్ని, సేవను రాజకీయం చేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. తన ఫ్యాక్టరీలను మూసివేస్తే, వాటిని మళ్లీ తెరవడానికి నరేంద్ర వర్మ ఆస్తులను అమ్ముకోవలసి వస్తుందని కోన రఘుపతి చెప్పిన మాటలకు బదులిచ్చారు. ప్రజలకోసం అవసరమైతే తన ఆస్తుల్ని అమ్ముకోడానికైనా సిద్ధమేనని అన్నారు. కోన రఘుపతిలా


ఎన్నికల ప్రచారంలో టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

వాడు, వీడు అని పిలిచే కు సంస్కారాన్ని తన తల్లిదండ్రులు తనకు నేర్పలేదని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గ్రామానికి తాగునీళ్లు, సాగు నీళ్లకు ఇబ్బంది లేకుండా ప్రతి ఇంటికీ కులాయి సౌకర్యం కల్పించి రెండు పూటలా మంచినీళ్లందిస్తానని హామీ ఇచ్చారు. రోడ్లు, పారిశుధ్యం, కాలువల నిర్వహణతో పాటు, అభివృద్ధి, సంక్షేమాలన్నింటిని అందిస్తామని అన్నారు. ఒరుగంటి రెడ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి చంద్రబాబు హామీ ఇచ్చారని, ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒరుగంటి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.

ముగ్గురికి షోకాజ్ నోటీసులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యమే కారణం!

ప్రజాశక్తి - పర్చూరు

ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండ అధికారులు సత్వర చర్యలకు శ్రీకారం చుట్టారు. బాపట్ల ఆర్డీఒ జి రవీందర్ స్థానిక తహశీల్దారు సుబ్బయ్యతో కలిసి మండలంలోని చెరుకూరు, రమణాయపాలెం, పోతుకట్ల, వీరన్నపాలెం గ్రామాల్లోని మంచినీటి చెరువులను పరిశీలించారు. వేసవికాలం సమీపించిన నేపథ్యంలో చెరువులను పర్యవేక్షించారు. చెరువులకు నీళ్లు నింపే క్రమ పద్ధతి గురించి అధికారులను అడిగి తెలుసు కున్నారు. అన్ని ఫిల్టర్ బెడ్లు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. రమణాయపాలెంలో నీళ్లు వృధాగా పోవటాన్ని ఆర్డీఒ గమనించి అధికారులను నిలదీశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన విఆర్ఒ, గ్రామ


తాగునీటి చెరువును పరిశీలిస్తున్న బాపట్ల ఆర్‌డిఒ రవీందర్

కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో చెరుకూరు కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం జగన్‌ను గెలిపించాలి

ప్రజాశక్తి -రేపల్లె

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సంక్షేమ, అభివృద్ధి పాలనను మరోసారి స్వాగతించాలని వైసిపి యువనేత మోపిదేవి రాజీవ్ కోరారు. పట్టణంలోని 24వ వార్డులో వైసిపి అభ్యర్థి డాక్టర్ గణేష్ తనయుడు డాక్టర్ సృజన్ పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసిపి నేతల తనయుల ప్రచారానికి ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోపిదేవి రాజీవ్ మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. సచివాలయ డివిజన్ పరిధిలో రూ.22కోట్ల విలువైన వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినట్లు తెలిపారు. ప్రతి గడపలో సంక్షేమ పథకాలు పొందిన లబ్దిదారులు తమ ఓటు వేస్తామంటూ మాట ఇస్తున్నారని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో పిల్లల చదువుకు భరోసా కలిగిందని తెలిపారు. సొంతింటి భాగ్యం దక్కిందని, చిరువ్యాపారాలకు ఆర్థిక ఆసరా


ఎన్నికల ప్రచారంలో మోపిదేవి రాజీవ్

కలిగిందంటూ లబ్ధి పొందిన ప్రజలు తెలపటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్‌ఎ అభ్యర్థి డాక్టర్ గణేష్, ఎంపి అభ్యర్థి నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి, 24వ వార్డు కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జి ప్రశాంత్ కుమార్, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిమట బాలాజీ, రావు ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఘనంగా జిఎస్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -రేపల్లె

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసం నందు జన్మదిన వేడుకల్లో టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎంఎల్‌ఎ అనగాని సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్‌ఎ అనగాని మాట్లాడుతూ ప్రజాగళంతో వైసిపి ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టాయని అన్నారు. ప్రజాగళంతో సిఎం జగన్ పాలనలో జరుగుతున్న అరాచకాలను చూపి, ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజాస్వామ్య బద్ధంగా చంద్రబాబు దండ యాత్ర చేశారని


కేక్ తినిపిస్తున్న ఎంఎల్‌ఎ అనగాని సత్యప్రసాద్

పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి చరిత్ర సృష్టించనుందని తెలిపారు.


టిడిపిలో చేరిన వారితో ఎంఎల్‌ఎ ఏలూరి

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని సూరవరపుపల్లికి చెందిన ఎస్‌సి, ఒసి, బిసి సోదరులు స్థానిక ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఎంఎల్‌ఎ ఆహ్వానించారు. టిడిపి నాయకులు రావిపాటి సీతయ్య, అనంతవరం మాజీ ఎంపిటిసి ఇంటూరి హనుమంతరావు, నాయకులు కోయ సతీష్, చంద్రశేఖర్, ఎం శ్రీనివాసరావు, బి రమణమూర్తి, రామాంజి పాల్గొన్నారు.

బైకులు, ఆటోలతో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-రేపల్లె

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కౌన్సిలర్ తులసీదుర్గ పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు పట్టణానికి వస్తున్న సందర్భంగా బైకులు, ఆటోలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఎంఎల్‌ఎ అనగాని సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాగళం సభలో చంద్రబాబు సమక్షంలో ఆయన టిడిపిలో చేరారు. వైసిపి ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలు ఎంతో నష్టపోయాయని అన్నారు.


మహిళలతో మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందనారెడ్డి

మహిళలతో చందనారెడ్డి భేటీ

ప్రజాశక్తి - పొదిలి

మాగుంట చారిటబుల్ ట్రస్ట్, సింగర్ కంపెనీ ఆధ్వర్యంలో నడుపుతున్న ఉచిత కుట్టు మెషిన్ శిక్షణా కేంద్రాన్ని టిడిపి యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందనారెడ్డి శుక్రవారం సందర్శించారు. రథం రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలతో ఆమె కొద్ది సేపు ముచ్చటించారు. ఆత్మకూరి బ్రహ్మయ్య, చెరుకూరి ఆదిలక్ష్మి, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, ట్రైనర్ సుశీల పాల్గొన్నారు.


ఇంకొల్లు వైద్యశాలకు ఫర్నీచర్ అందజేస్తున్న దృశ్యం

వైద్యశాలకు ఫర్నీచర్ అందజేత

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన మిడ్ వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అంబటి శ్రీనివాస్ ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫర్నిచర్ అందజేశారు. మంచాలు-3, స్ట్రెచర్-1, ట్రాలీస్, ఎగ్జామినేషన్ టేబుల్, ఆఫీసు టేబుల్, సెలైన్ స్టాండులతో పాటు తదితర ఫర్నిచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను వైద్యులు డాక్టర్ భాను ప్రకాశరావు, టి అంజలి అభినందించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ కోటేశ్వరరావు, సూపర్‌వైజర్లు మౌళి, ప్రభావతి పాల్గొన్నారు.

'గీతం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక గీతం జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరి చారు. సీనియర్ బైపీసీ విభాగంలో పులి గాయత్రి దేవి 974 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించారు. డి నాగజ్యోతి 940 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి శ్రీనివాస రావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో బొర్రా మనోహర్ 977 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కళాశాల విద్యార్థి తోటకూర శ్రీహర్ష 969 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, వివిఎన్ నవ్యశ్రీ 966 మార్కులతో తృతీయ స్థానం పొందినట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో గీతం జూనియర్ కళాశాల విద్యార్థులు చందవోలు భవ్యశ్రీ 458 మార్కులు, కారంకి పావని 445 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి అభినందించారు.

రేషన్ డీలర్‌పై వేటు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేషన్ షాప్ డీలర్‌పై ఎన్నికల అధికారి చర్యలు తీసుకోవడం కలకలం రేపింది. స్థానిక షాప్ నెంబర్ 080007 నిర్వహిస్తున్న రేషన్ షాప్ డీలర్ మైలా నాగేశ్వరరావు ఇటీవల పర్చూరు వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి యడం బాలాజీతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందడంతో నియోజకవర్గ ఎన్నికల అధికారి, బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ డీలర్ షాపు విధుల నుంచి నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తహశీల్దార్ సంధ్య శ్రీ శుక్రవారం తెలిపారు. ఇటీవల మార్టూరులో జరిగిన వైసిపి నాయకుల ఎన్నికల ప్రచారంలో రేషన్ డీలర్ పాల్గొన్న సంఘటనపై సి-విజిల్ యాప్ ద్వారా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అధికారి, ఎంపిడిఒ గొరిక పూడి నితిన్‌కు ఫిర్యాదు అందింది. ఫిర్యాదుపై తహశీల్దారు సంధ్యశ్రీ విచారణ చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నది వాస్తవమేనని ఆర్‌డిఒకి నివేదిక ఇచ్చారు. దీంతో ఏడో నంబర్ రేషన్ షాప్ డీలర్ మైలా నాగేశ్వరరావుని విధుల నుంచి తొలగిస్తూ ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ చేసి నట్లు తెలిపారు. ప్రభుత్వం చే నియమించబడిన రేషన్ షాప్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


టిడిపిలో చేరిన కోరిసపాడు దళితులు

టిడిపిలో చేరిన దళితులు

ప్రజాశక్తి - పంగులూరు

కోరిసపాడు గ్రామానికి చెందిన 15దళిత కుటుంబాలు ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టిడిపిలో శుక్రవారం చేరారు. పంగులూరు మండలంలోని ముప్పవరం టిడిపి కార్యాలయంలో కోరిశపాడు గ్రామానికి చెందిన ఎర్రమోతు సుబ్బారావు, గోగుల మూడి శ్రీను, దార్ల ప్రశాంత్, నూనె శ్రీకాంత్, కసుకుర్తి మహేష్, జ్యోతి శ్రీనాథ్, అల్లడి సుధీర్, నవీన్, అజయ్, సత్యనారాయణ, వేణుగోపాలరావు, మహేష్, నాగయ్య టిడిపిలో చేరారు. వీరికి ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవి టిడిపి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు. వైసిపి వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నగరం

ధూళిపూడి ఫీడర్ పరిధిలో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ధూళిపూడి, చిరకాలవారిపాలెం, కోలగనివారిపాలెం, ఏలేటిపాలెం, బెల్లంవారిపాలెం, న్యూ అంబేద్కర్ నగర్, బోర మాదిగపల్లి, అడ్డంకివారిపాలెం పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎఇ ఎండి నాగుల్ మీరా తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.



అన్నా రాంబాబు సమక్షంలో వైసిపిలో చేరికలు

మీ సేవకుడిగా ఉంటా

వైసిపి అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు

ప్రజాశక్తి - మార్కాపురం

మీలో ఒకడిగా, మీ సేవకుడిగా కొనసాగేందుకు మాత్రమే రాజకీయాల్లోకి వచ్చినట్లు గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం వైసిపి అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ఆదరించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 27వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. తనతో పాటు ఎంపిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు.

వైసిపిలో చేరికలు

టిడిపికి చెందిన సయ్యద్ మల్లికా వైసిపి అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు సమక్షంలో శుక్రవారం వైసిపిలో చేరారు. ఆమెతో పాటు 100 కుటుంబాలు చేరారు. పార్టీ కండువాలను కప్పి ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు వైసిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి పట్టణ కన్వీనర్ షేక్ ఇస్మాయిల్, మాజీ ఎఎంసి చైర్మన్‌లు గుంటక సుబ్బారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ షేక్ మక్బుల్‌బాష పాల్గొన్నారు.

డ్రీమ్జ్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్



జాగర్లమూడి పావని



గంటా ప్రవీణ్



వైష్ణవి



కాత్యాయిని

ఇంటర్ ఫలితాల్లో పూసపాడు అడ్డరోడ్డులోని డ్రీమ్జ్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో జాగర్లమూడి పావని 464 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. గంటా ప్రవీణ్ 460 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. 450కిపైగా ఆరుగురు విద్యార్థులు, 400కిపైగా 23మంది విద్యార్థులు సాధించారు. సీనియర్ ఎంపిసిలో వైష్ణవి 956మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. కాత్యాయిని 985మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. 950కిపైగా 28మంది, 900కిపైగా 44మంది మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీలో 987మార్కులు సాధించారు. 950కిపైగా ఇద్దరు మార్కులు సాధించారు. విజేతలను కళాశాల యాజమాన్యం పేర్ని రాధాకృష్ణ, పేర్ని సతీష్ చంద్ర అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన 'శ్రీసాధన'

ప్రజాశక్తి - మార్కాపురం



షేక్ హుస్సేన్



కె లక్ష్మి



జి సాయి హన్సిక



వై జాహ్నవి

ఇంటర్మీడియట్ ఫలితాలలో శ్రీసాధన కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో షేక్ హుస్సేన్ 463, కొప్పుల లక్ష్మి 463, బి గోవర్షిణి 462, సిహెచ్ యశశ్రీ 462, ఎం ప్రిన్సి సలోమి 460, కె మల్లేశ్వరి 460 మార్కులు సాధించారు. బైపిసిలో పి నవ్యశ్రీ 443, ఎస్ ప్రేమ్‌శ్రీరెడ్డి 427, కె చైతన్య 425 మార్కులు సాధించారు. ఎంఇసిలో ఎ నాగసాయి 492 మార్కులతో రాష్ట్ర ర్యాంకు సాధించారు. సిఇసిలో కె హరిచందన 479, ఎం భావనరెడ్డి 477మార్కులు సాధించారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో జి సాయి హన్సిక 985, వై జాహ్నవి 983, జి గోపి సతీష్‌రెడ్డి 983, ఎల్ నరసింహ నాయుడు 982, ఎస్ వర్షిణి 980 మార్కులు సాధించారు. బైపిసిలో ఎన్ శ్రీలక్ష్మి 976 మార్కులు సాధించారు. సిఇసిలో పి సత్యనారాయణరెడ్డి 945 మార్కులు సాధించారు. వీరందరినీ డైరెక్టర్లు విఆర్‌కె ప్రసాద్, జిఎల్ రమేష్‌బాబు, దొంతిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంవి క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ టి క్రిష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎల్ శ్రీనివాసులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - మార్కాపురం

ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో ఎంవిఎల్ యశశ్విని 460 మార్కులు, ఎంవి వర్షిణి 440, ఎంఎస్ అమృత వర్షిణి 460 మార్కులు సాధించారు. సిఇసిలో ముబీనా 422 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపిసిలో జివిఎల్ హరిప్రియ 985 మార్కులు, వివి హంసిక 977, ఎం అక్షయ 976 మార్కులు సాధించారు. బైపిసిలో ఓ కోటశ్వరరావు 970, డి హసీన 962 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని కళాశాల చైర్మన్ గొలమారి శివారెడ్డి, ప్రిన్సిపల్ కె సుబ్బారెడ్డి, డైరెక్టర్లు ఎ మోహన్, కె శ్రీనివాసరావు, జి కళ్యాణ్‌రెడ్డి, పి రవికుమార్‌రెడ్డి అభినందించారు.

కమలా కళాశాలలో : ఇంటర్ ఫలితాల్లో కమలా జూనియర్ కళాశాల విద్యార్థుల విజయ విహారం చేశారని కళాశాల ప్రిన్సిపాల్ దేసు సుధాకర్ తెలిపారు. సీనియర్ ఎంపీసీలో ఎంవిఎన్ హిమజ 988 మార్కులతో పట్టణంలో మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ ఫలితం రాష్ట్రంలో ఐదో స్థానం అని చెప్పారు. ఎ రాజేష్ 982, పివిఆర్ యసోధరణి 979 మార్కులు సాధించారు. బైపిసిలో దూదేకుల అయేషా 980 మార్కులతో పట్టణంలో మొదటి స్థానం, ఇ నందిని 957, పి అజయ్ 949 మార్కులు సాధించారు.



అయేషా



జివిఎస్ గణేష్

జూనియర్ ఎంపీసీలో గొంట్లా గణేష్ 455, పాత్రా ప్రణవి 451, టి తులసి 450 మార్కులు, బైపిసిలో షేక్ హిదయతుల్లా 424 మార్కులు, ఇమ్మడి కిరణ్ 423, డి మెహ్తాబ్ 419 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణతలో పట్టణంలో తమ విద్యార్థులు అగ్ర భాగాన నిలిచారని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పెనుగొండ పవన్ కుమార్, ప్రెసిడెంట్ పెనుగొండ అనంత వెంకట కేశవరావులు అభినందించారు.

ఎంఎల్ఎ ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక

చేరిన వారిలో సర్పంచులు, మాజీ సర్పంచులు..

ప్రజాశక్తి - చిన్నగంజాం

పర్చూరు నియోజకవర్గంలో వైసిపికి భారీ షాక్ తగిలింది. స్వయాన బాలినేని ప్రణీత్‌రెడ్డి చక్రం తిప్పిన వలసలు ఆగలేదు. మండలంంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, వైసిపి శ్రేణులు టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో టిడిపిలో శుక్రవారం చేరారు. వారికి ఎంఎల్ఎ ఏలూరి టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. పెద్దగంజాం సర్పంచ్ నక్కల కృష్ణ, పెద్దపల్లిపాలెం సర్పంచ్ సైకం మణి, చిన్నగంజాం మాజీ జెడ్పిటిసి కొక్కిలిగడ్డ విష్ణు నారాయణ, రాజుబంగారుపాలెం మాజీ సర్పంచి కుక్కల బురకాయలరెడ్డి, పెద్దగంజాం మాజీ సర్పంచ్ ఆట్ల పెద్దసిద్ధారెడ్డి, చిన్నగంజా మాజీ సర్పంచ్ కుంభ నాగమణి, ఎంపీటీసీ మనపోలు రాంబాబురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఆసోది వెంకటేశ్వరరెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పెద్దగంజాం పెద్దపల్లెపాలెం, రాజుబంగారుపాలెం, మోటుపల్లి, కొత్తపాలెం రామచంద్రయ్య నగర్, మున్నంవారిపాలెం, చిన్నగంజాం గ్రామాలకు చెందిన వెయ్యి మంది ఎంఎల్ఎ ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలో అత్యంత వెనుకబాటుకు గురైన చిన్నగంజాం మండలం అభివృద్ధికి గత టిడిపి ప్రభుత్వంలో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూపురేఖలు మార్చానని అన్నారు. ప్రజల చిరకాల స్వప్నం ఎన్టీఆర్ వారధిని నిర్మించి మళ్లీ ఓటు అడుగుతానని చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చి మళ్లీ ఎన్నికల్లో ఆ బ్రిడ్జిపై నడుచుకుంటూ వచ్చి ఓటు అడిగానని గుర్తు చేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు 32ఎకరాల్లో ఆగం ట్యాంకు నిర్మాణం చేపట్టి సురక్షిత మంచినీరు అందించానని అన్నారు. రానున్న టిడిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల ఆర్థిక స్వావలం మనకు అద్భుతమైన ప్రణాళిక రచించినట్లు తెలిపారు. ఎస్సీ, రెడ్డి, మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తామని అన్నారు. మండల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశానని అన్నారు. నియోజకవర్గంలో 20వేల మందికి రెండు సెంట్లు స్థలం అందించేందుకు అధినేత చంద్రబాబును సైతం ఒప్పించానన్నారు. తనపై నమ్మకంతో వచ్చిన మీకు అండగా ఉంటానని అన్నారు. ఏ కష్టం వచ్చినా తనకు మీ కుటుంబ సభ్యుడిగా ఉంటానని పేర్కొన్నారు. జగన్ అరాచక పాలనలో ఐదేళ్లు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో వచ్చిన రోజు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాడని అనుకున్నానని, జగన్ అందరి ఆశలను తలకిందులు చేసి ప్రజల డబ్బును అక్రమంగా దోచుకున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించేందుకు నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ప్రశాంతమైన, ఆకుపచ్చ పర్చూరు, ఆధునిక పర్చూరు తన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోద వీరయ్య, సర్పంచ్ సాంబశివరావు, ఎంపీటీసీ పీత భార్గవి, మాజీ ఎంపీటీసీ రాములు, శ్రీనివాసు పాల్గొన్నారు.



టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు



సిద్ధం సభకు బయలుదేరిన ఐలవరం వైసీపీ నేతలు

సిద్ధం సభకు తరలిన నాయకులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సిద్ధం సభకు నియోజకవర్గం నుండి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ బస్సుల్లో తరలి వెళ్లారు. మండలంలోని వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు దగ్గరుండి ప్రజలను ప్రత్యేకంగా కేటాయించిన ఆర్టీసీ బస్సులు ద్వారా సభకు తరలించారు. వేమూరు వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల్లో వివిధ గ్రామాల ప్రజలు తరలి వెళ్లారు.



టిడిపిలో చేరిన వారితో వేగేశన నరేంద్రవర్మ

వర్మ సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని దుండువారిపాలెం పంచాయతీ తిమ్మారెడ్డిపాలెంకు చెందిన పిట్ల వసంతరెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపిలో చేరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ టిడిపి కండువాను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. నరేంద్ర వర్మ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరు సహకరించి తనను గెలిపిస్తే అవినీతి లేని పాలన చూపిస్తానని అన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కెఎస్‌కె విజయభేరి

ప్రజాశక్తి - భట్టిప్రోలు



పెద్ద సింగు మౌనిక



నాయుడు మగధారమ్మ

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో స్థానిక కెఎస్‌కె బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసిలో పెద్ద సింధు మౌనిక 930 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానాన్ని సాధించింది. ప్రథమ సంవత్సరం హెచ్ఇసి విద్యార్థిని కాగిత చంద్రలీల 479మార్కులు సాధించి మొదటి సంవత్సరం విద్యార్థుల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. 207మంది ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా 185మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 209 మంది హాజరు కాగా 191మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ స్వర్ణలత తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ కత్తెర సురేష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం భాస్కరరావు, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ విక్టర్ అభినందించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - బాపట్ల

సెబ్ అధికారులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 89మద్యం సీసాలు (క్వార్టర్ బాటిళ్ళు), ముగ్గురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు. పట్టణానికి చెందిన మున్నం వెంకట సుధాకర్ రెడ్డి, పిట్టలవానిపాలెంకు చెందిన పిట్టు మధుసూదన్‌రెడ్డి, మున్నం లక్ష్మారెడ్డిని అదుపులోకి తీసుకోగా పిట్టలవానిపాలెం మద్యం దుకాణం సూపర్వైజర్ పిట్టు గోపిరెడ్డి అనే మరో నిందితుడు పారిపోయినట్లు తెలిపారు.

'ప్రైవేట్' విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు

ఇంటర్ ఫలితాల్లో 14వ స్థానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బాపట్ల జిల్లా 14వ స్థానంలో నిలవగా, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లా 17వ స్థానంలో నిలిచింది. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి జిల్లా నుంచి 8,230 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 5,010 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా విద్యార్థులు మొదటి సంవత్సరం ఫలితాల్లో 61 శాతం ఉత్తీర్ణత సాధించినట్లయింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం 67 శాతం, ద్వితీయ సంవత్సరం 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీకౌంటింగ్, రీవాల్యుయేషన్ ఫీజు చెల్లింపునకు ఈ నెల 18 నుంచి 24 వరకు అవకాశం కల్పించారు. మే 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ నిర్వహించనున్నట్లు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు.



బాలినేనిని సత్కరిస్తున్న వైసిపి నాయకులు

యాదవులకు సముచిత స్థానం

రాజ్యసభ్య సభ్యులు బీదా మస్తాన్‌రావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వైఎస్ఆర్ కాంగ్రెసుపార్టీలోనే యాదవులకు సముచిత స్థానం ఉందని రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు అన్నారు. స్థానిక గోపాలనగర్‌లోని తిరుపతమ్మ గుడివద్ద ఉన్న కళ్యాణ మండపంలో శుక్రవారం ఒంగోలు నియోజకవర్గ యాదవుల ఆత్మీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో బీదా మస్తాన్‌రావు, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. మస్తాన్‌రావు మాట్లాడుతూ యాదవులు రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలని, ఒంగోలు బాలినేని శ్రీనివాసరెడ్డి గెలుపుకు కృషి చేయాలని కోరారు. బాలినేని మాట్లాడుతూ యాదవులకు ఎప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి పోతుల సునీత, కనిగిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, వైసిపి ఒంగోలు నగర అధ్యక్షులు కటారి శంకర్, కార్పొరేటర్ జడా వెంకటేష్, ఎఎంసి చైర్మన్ కొటారి రామచంద్రరరావు పాల్గొన్నారు.

కళాశాలల వద్ద పండుగ వాతావరణం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థులు మార్కులలో పై చేయి సాధించారు. ఉత్తమ మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులను సొంతం చేసుకున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు వెలువడటంతో ఆయా కళాశాలల వద్ద పండుగ వాతావరణం నెలకొంది, ఆయా కళాశాలల యాజమాన్యాలు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి మిఠాయిలు పంచిపెట్టారు.

శ్రీ సరస్వతి సంచలన విజయాలు

స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీ సరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవి రమణారెడ్డి మాట్లాడుతూ మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలలో తమ విద్యార్థులు సంచలన విజయాలు సాధించారని తెలిపారు, . శ్రీ సరస్వతి విద్యాసంస్థలకు గుర్తింపు తీసుకురావడానికి సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, ఫలితాలు సాధించుటకు కషి చేసిన డైరెక్టర్లు అధ్యాపకులు అధ్యాపకవేతరులకు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. జూనియర్ ఎంపిసిలో సిహెచ్ ఉదయ్ కిరణ్ 470కి 466, ఏ వెంకట భాను ప్రకాష్ 466 మార్కులు, ఎం. అజయ్ కుమార్ 466 మార్కులు, కె.ప్రతిమ 466 మార్కులు, కె. హేమలత 466 మార్కులు, ఎం భాను ప్రకాష్ 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారన్నారు. 466 మార్కులు పైన ఆరుగురు, 465 మార్కులు పైన 11 మంది స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించారన్నారు. 464 మార్కులు పైగా 18 మంది 460 మార్కులు పైన 126 మంది, 450 మార్కుల పైగా 248 మంది జూనియర్ బైపిసిలో ఆర్. జెస్సి 435/440కి 435 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారన్నారు. 430 పైగా ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యంతమ ఫలితాలు సాధించారు. సీనియర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు 991 మార్కులతో కె.సాయి కిరణ్ టాప్ ర్యాంక్ అందుకున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యాసంస్థల డైరెక్టర్ ఏ గణేష్ రెడ్డి, ఏ గంగా శంకర్ రెడ్డి, సీఈవో ఎస్ వి సురేష్, డిన్స్,ప్రిన్సిపల్ అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నల్లూరి

శ్రీ హర్షిణి విద్యార్థుల విజయభేరి

ఇంటర్మీడియట్ ఫలితాలలో శ్రీహర్షిణి విద్యార్థులు విజయభేరి మోగించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో అడకా మధు కిరణ్, మాదాల వెంకట్రావు, బొమ్మిశెట్టి హర్షవర్ధన్ 470కి 464 మార్కులతో కళాశాల మొదటి స్థానాన్ని సాధించారు. నంబూరి. మదుల, రావి. యశ్విత, లెక్కల శివారెడ్డి, వంకాయపాటి జాన్ తేజ 463 మార్కులతో ద్వితీయ స్థానాన్ని సాధించారు. బైపిసి విభాగంలో కటారి హారిక, షేక్ కౌసర్ 429 /440కి 429 మార్కులతో కళాశాల మొదటి స్థానాన్ని సాధించారు, సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఎల్.శరణ్య 1000కి 985 మార్కులతో మొదటి స్థానాన్ని, పిజ్జా బేగం 980 మార్కుతలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, సహకరించిన అధ్యాపక బృందాన్ని కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ దాది ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ కె.నారాయణ, డి.రమేష్, ఏఒ శేఖర్, అభినందించారు.

ఎన్ఆర్ఐ విద్యార్థులు విజయదుందుభి

ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఎన్ఆర్ఐ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఆర్. వెంకట నాగ గోదా లక్ష్మి



విద్యార్థులను అభినందిస్తున్న గోరంట్ల రవికుమార్

దేవి 464/470కి 464 మార్కులు, ఎం.వెంకట నాగసాయి 463 మార్కులు, కె.ప్రవల్లిక 462 మార్కులు, ఎం.మేఘన 462 మార్కులు, ఆర్.మంజు అజిత శ్రీ 461 మార్కులు, మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో ఎస్.నాగ వైష్ణవి 440కి 425 మార్కులు, పి.సుస్మిత రాణి 427 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఎస్‌కె షాకీర 1000కి 985 మార్కులు, కె.సాయి రమ్య 981 మార్కులు అందుకున్నారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో కె.యశస్వి 1000కి 985 మార్కులు సాధించారు. విద్యార్థులను విద్యాసంస్థల డీన్ పి. సురేష్, ప్రిన్సిపల్ పి.. మురళి కష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

శ్రీ ప్రతిభావంతులకు స్టేట్ ర్యాంకులు

ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రతిభా విద్యా సంస్థల విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్యులకు 465 మార్కులతో (స్టేట్ 3వ ర్యాంకు) ఐదుగురు, 464 మార్కులతో (స్టేట్ 4వ ర్యాంకు) ఒక్కరు. 463 మార్కులతో (స్టేట్ 5వ ర్యాంకు) ముగ్గురు, 462 మార్కులతో (స్టేట్ 6వ ర్యాంకు) ఎనిమిది. 461 మార్యులతో (స్టేట్ 7వ ర్యాంకు) నలుగురు సాధించినారు. సీనియర్ ఇంటర్ యం.పి.సి విభాగంలో 1000 మార్కులకు 986 మార్కులతో (స్టేట్ 7వ ర్యాంకు) ఒక్కరు, 985 మార్కులతో (స్టేట్ 8వ ర్యాంకు) ఇద్దరు, 984 మార్కులతో (స్టేట్ 9వ ర్యాంకు) ముగ్గురు, 983 మార్కులతో (స్టేట్ 10వ ర్యాంకు) నలుగురు, 982 మార్కులతో ఇద్దరు, 980 మార్కులతో ఒక్కరు విద్యార్థులు సాధించారు. బై.సి.సి విభాగంలో 1000 మార్కులకు 985 మార్కులతో స్టేట్ 7వ ర్యాంకు 983 మార్యులతో స్టేట్ 9వ ర్యాంకు, 982 మార్కులతో స్టేట్ 10వ ర్యాంకు సాధించినారు. విద్యార్థులకు వైస్ చైర్మన్ నల్లూరి సీతా రామాంజనేయులు, సిఇఒ సల్లూరి జయప్రకాశ్ నారాయణ్ అభినందనలు తెలియజేశారు.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీ సాయిరామ్' విజయభేరి



అమృత

ఇంటర్ ఫలితాలలో శ్రీ సాయిరామ్ విద్యార్థినుల విజయభేరీ సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచిన కొప్పర్తి అమృత 985/1000, ఇంకా ఎన్నో అత్యుత్తమ మార్కులును సాధించిన విద్యార్థినులను గతంలో జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో ఆల్‌ఇండియా 929 ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఎం.నందినికి కళాశాల కరస్పాండెంట్ ఎం. మోహన్ రావు, ప్రిన్సిపాల్ కరి అంజయ్య ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఓటమి భయంతోనే మహిళలపై దాడులు

- దామచర్ల స్థానంలో బాలినేని ఉంటే కార్యకర్తలకు క్షమాపణ చెప్పించేవాడు..
- ఒంగోలు వైసిపి ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే టిడిపి నాయకులు మహిళలపై దాడులకు తెగబెడుతున్నారని వైసిపి ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఒంగోలు కెబి రెస్టారెంట్‌లో ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డిని ఎంపీ అభ్యర్థి చేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు, ఎంఎల్‌సి పోతుల సునీత మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా అభ్యర్థులు పోటీ చేస్తున్నప్పుడు వారి కుటుంబసభ్యులు వారికి మద్దతుగా ప్రచారం చేయడం ఆనవాయితీ అని చెప్పారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలిని అడ్డుకోవడం, గర్భంతో ఉండి.. వాలంటీర్‌గా రాజీనామా చేసిన మహిళ మీద చేయిచేసుకోవడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు.



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ప్రజాస్వామ్యాన్ని టిడిపి వాళ్ల అపహాస్యం చేస్తున్నారని చెప్పారు. సమతానగర్ ఘటనలో సదరు టిడిపికి చెందిన మహిళ వైసిపి వాళ్లను బూతులు తిట్టడం జరిగిందన్నారు. దామచర్ల జనార్ధన్ స్థానంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఉంటే ఆయనకున్న మనస్తత్వానికి క్షమాపణలు చెప్పేవారని వివరించారు. జరిగిన పొరబాటును సరిదిద్దుకోకుండా టిడిపి వాళ్ల దాడులకు పురిగొల్పడం, దాడులు చేసి తప్పుడు ఫిర్యాదులు చేయడం సరికాదన్నారు. అధికారులు కూడా టిడిపి వాళ్లకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మరో 30 రోజుల్లో టిడిపి వాళ్ల నాటకానికి ప్రజలు తెరదింపుతారని చెప్పారు. వైసిపి దర్శి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సభ్య సమాజంలో మహిళలను గౌరవించుకోవడం నేర్చుకోవాలన్నారు. రాజీనామా చేసిన వాలంటీర్‌కు క్షమాపణ చెప్పాలని, ఘర్షణకు కారణం ఏఆర్ కానిస్టేబుల్ భార్య కాబట్టి ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఒంగోలులో బాలినేని హవాను చూడలేకనే దామచర్ల నీచపు రాజకీయాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మెప్పు పొందేందుకు అధికారులు వైసిపికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. తన కోడలిని బజారుకు లాగిన వారిని ఎవరినీ వదలిపెట్టనని పేర్కొన్నారు. ఘటనకు కారకులైన తెలుగుదేశం పార్టీ వాళ్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎల్‌సి పోతుల సునీత కూడా పాల్గొన్నారు.